కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన పద్మవిభూషణ్ అవార్డును మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ప్రకటించడంతో సెట్విన్ మాజీ డైరెక్టర్ కొప్పుల ప్రవీణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో వెంకయ్యనాయుడును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షాలు తెలిపారు.

– చాంద్రాయణగుట్ట, జనవరి28

30న జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవం

సుల్తాన్‌బజార్, జనవరి 28: జాతీయ కుష్టు నిర్మూలన దినం ను ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వెనిరియాలజిస్ట్స్, లెప్రాలజిస్టుల సంఘం అధ్యక్షుడు ఎ. వెంకటకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం వద్ద నుంచి ఉదయం 7 గంటలకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరం, శివారు ప్రాంతాలకు చెందిన పలు రంగాల ప్రముఖులు, చర్మవ్యాధి నిపుణులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు.

ఎక్కడి చెత్త అక్కడే..

చుడీబజార్ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

నగరంలోని రోడ్లు, వీధుల్లో, పారిశుధ్య నిర్వహణ చెత్త సేకరణ లక్ష్యం నీరుగారుతున్నది. పలుచోట్ల ఎక్కడి వ్యర్థాలు అక్కడే పేరుకుపోతున్నాయి. బేగంబజార్‌లోని చుడీబజార్‌లో రోడ్డుపై చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందని, ఇండ్లలో ఉండలేక పోతున్నామని ఆదివారం స్థానికులు ఆరోపించారు. ఫిర్యాదు చేసిన ప్పటికీ పారిశుధ్య సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

– సుల్తాన్‌బజార్, జనవరి 28

హౌసింగ్ బోర్డు సొసైటీ కార్యదర్శిగా ముజీబ్‌హుస్సేనీ

స్వామిగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న ముజీబ్‌హుస్సేనీ

సుల్తాన్‌బజార్, జనవరి 28: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ గచ్చిబౌలి మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ బోర్డు సొసైటీ కార్యదర్శిగా టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో ముజీబ్ హుస్సేనీ సొసైటీ కార్యదర్శిగా నియమితులయ్యారని సొసైటీ అధ్యక్షుడు, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్‌కు, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, హౌసింగ్ బోర్డు డైరెక్టర్లకు ముజీబ్‌హుస్సేనీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లంగర్‌హౌస్‌కు చెందిన గడ్డి హాసినిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు సన్మానించారు. అమెరికాలోని కెన్నెడి స్పేస్ సెంటర్‌లో శిక్షణ కోసం ఎన్నిక కావడంతో పాటు ఐసీఎస్‌సీలో 98 శాతం మార్కులు సాధించడంతో ఆదివారం కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ హనుమంతరావు చేతుల మీదుగా హాసిని అవార్డును అందుకున్నారు.

– మెహిదీపట్నం, జనవరి 28

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

● మాజీ ఎంపీ వి.హనుమంతరావు

జ్యోతి ప్రజ్ఞాన చేస్తున్న వి.హనుమంత్‌రావు, జడ్జి శాలినీశాకెల్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్, ట్రస్టీలు

కాచిగూడ, జనవరి 28: సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్‌రావు అధ్యక్షతన పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువుతున్న తెలంగాణలోని మున్నూరు కాపు పేద విద్యార్థులకు ఆదివారం కాచిగూడ మున్నూరు కాపు సంఘంలో ప్రతిభా పురస్కరాలను వి.హనుమంతరావు అందజేశారు. అనంతరం వీహెచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకుంటేనే బంగారు భవిష్యత్ అని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే మహానీయులు సమాజానికి బంగారు బాటలు వేశారని, అది కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జల్లా కోర్టు జడ్జి శాలినీశాకెల్, ట్రస్టీలు పిల్లి శ్రీనివాస్, ఆకుల పాండు రంగారావు, దడువై రాఘవేందర్, మంద సూర్యప్రకాశ్, నిమ్మ శంకర్, ఆకుల నగేశ్, వై.దేవేందర్, ఎ.చంద్రశేఖర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్లాక్‌బెల్ట్‌లు ప్రదానం చేసిన సినీ నటుడు సుమన్

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

● సినీ నటుడు సుమన్

చాంద్రాయణగుట్ట, జనవరి 28 : ప్రతి విద్యార్థి చదువులతో పాటు క్రీడారంగంలో రాణించాలని సినీ నటుడు సుమన్ అన్నారు. ఆదివారం పాతబస్తీలో నాయక్ బుడోఖాన్ కరాటే మాస్టర్ గణేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు బ్లాక్ బెల్ట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి ఆత్మస్థైర్యంతో రాణించాలని అన్నారు. సమాజంలో మంచి చెడులను గమనిస్తూ సాధ్యమైనంత వరకు మంచి చేసే ఆలోచన చేయాలని తెలిపారు. సామాన్య వ్యక్తి నుంచి ధనవంతుడి వరకు దేశం కోసం మంచి చేయాలనే తపన ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాస్టర్లు పాల్గొన్నారు.

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయ ప్రతినిధులు

పట్టువస్త్రాలు సమర్పణ

చాంద్రాయణగుట్ట, జనవరి 28 : పాతబస్తీ లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. యాదాద్రి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.భాస్కర్ ఆలయ మర్యాదలతో శ్రీమహంకాళి కమిటీ సభ్యులకు స్వాగతం పలికారు. ఆలయంలో కొలువుదీరిన స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రతినిధులు జి. అరవింద్ కుమార్‌గౌడ్, కె.వెంకటేశ్, కె.విష్ణుగౌడ్, జి.కాశీనాథ్‌గౌడ్, జె.లక్ష్మీనారాయణగౌడ్, బంగ్లా రాజు యాదవ్, బి.మారుతి యాదవ్, సి.వెంకటేశ్, శీరా రాజ్‌కుమార్, సి.రాజ్‌కుమార్ యాదవ్, శేషునారాయణ, వినోద్ కుమార్, గడ్డం రవి, గడ్డం శ్రీనివాస్‌లతో పాటు మాణిక్‌ప్రభుగౌడ్, శ్యామ్‌రావు ముదిరాజ్, పాతనగర జర్నలిస్టులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలే కీలకం

శాంతి, భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో ముఖ్యమని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం ఆసిఫ్‌నగర్ డివిజన్ దత్తాత్రేయకాలనీలో ఆసిఫ్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36 సీసీ కెమెరాలను ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ప్రతినిధి మూసాతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం, జనవరి 28

అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి

ప్రజలకు అంతర్గత రోడ్లను నిర్మించి ఇవ్వడానికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం నానల్‌నగర్‌డివిజన్ హకీంపేట్‌లో నిర్మిస్తున్న వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. – మెహిదీపట్నం జనవరి 28

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ

ఉప్పుగూడ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం తానాజీనగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా డి. కనకాచారి, గౌరవ అధ్యక్షుడిగా ఎల్. శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షులుగా కె.బాలకృష్ణాచారి, పి.దక్షిణామూర్తి, డి.లక్ష్మణాచారి, ఎన్. మహారాజ్‌చారి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌చారితో పాటు పలువురు సభ్యులకు కమిటీలో స్థానం కల్పించారు. నూతన కమిటీ ఏర్పాటు అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. – చాంద్రాయణగుట్ట, జనవరి 28

సురేంద్రమల్ లూనియా మృతి తీరని లోటు

సంఘ సేవకుడు, జైన్ రత్నా అవార్డు గ్రహీత దివంగత సురేంద్రమల్ లూనియా మృతి పట్ల పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రిథేశ్ జాగిర్దార్, నిర్మల్ సింఘ్వీ, సతీశ్ అగర్వాల్, సురేంద్ర భండారిలతో కలిసి సురేంద్ర లూనియా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీపాల్ దేశ్‌లహరా, నరేశ్ పరేఖ్, యోగేశ్, నవీన్ కపాడియా, అశోక్ తదితరులు పాల్గొన్నారు. – సుల్తాన్‌బజార్, జనవరి 28

రాష్ట్ర బీసీ యువజన సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేశ్, ఈబీసీ యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు భరత్‌కుమార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. – బేగంపేట్, జనవరి 28

పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు పావని తెలిపారు. సభ్యులు నేహా, అభిల్, ఇర్ఫాన్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్, జనవరి 28

జనాభా ప్రాతిపదికన బీసీలకు టికెట్లు ఇవ్వాలి

కాచిగూడ, జనవరి 28: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లను కేటాయించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నింబోలిఅడ్డా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 54 శాతం ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన టికెట్లు ఇవ్వకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో 120 కులాలుంటే అందులో అత్యధిక కులాలు నేటి వరకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం లభించలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూలిజాల కృష్ణ, భూషణ్‌భాస్కర్, ప్రశాంత్‌నిమ్‌కర్, ప్రదీప్‌గౌడ్, కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో.. మౌలిక వసతులు కల్పించాలి

ఖైరతాబాద్, జనవరి 28 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో వసతులు లేక డ్రా పౌట్స్ పెరుగుతున్నాయని, మరుగుదొడ్ల సౌకర్యం లేక ఆడపిల్లలు పాఠశాలలకు రావడం లేదన్నారు. ఐటీ రంగం విస్తరిస్తుందని చెప్పుకుంటున్న తరుణంలో రాష్ట్రంలోని సుమారు పదివేల పాఠశాలల్లో కంప్యూటర్లు అటకెక్కాయన్నారు. ఇతర దేశాల్లో 12వ తరగతి స్థాయిలోనే సాంతికేక విద్య, వృత్తినైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తారని, అలాంటి శిక్షణ తరగతులను ఇక్కడి విద్యార్థులకు అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ ప్రకటనకే ప రిమితం కావద్దన్నారు. తమిళనాడులో పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, అలాంటి పద్ధతిని ఇక్కడ తీసుకురావాలని, దాని పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారిని నియమించాలన్నా రు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. మల్టీజోనల్–2లో ఆగిపోయిన గెజిటెడ్ హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు.

బీసీలపై కుట్రపూరిత విధానాలను తిప్పికొట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఓబీసీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు దానకర్ణాచారి

కాచిగూడ, జనవరి 28: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ, ఓబీసీలపై అవలంభిస్తున్న కుట్రపూరిత విధానాలకు వ్యతిరేకంగా బీసీలందరూ పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ ఓబీసీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వి. దానకర్ణాచారి పిలుపునిచ్చారు. తెలంగాణ ఓబీసీ ఉద్యోగుల సమాఖ్య సర్వసభ్య సమావేశం ఆదివారం దానకర్ణాచారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల కులగణన చేపట్టాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారు విఠోభా, వి. చిన్నయ్య, జయప్రకాశ్, పాండు, రాంమూర్తి, రామరాజుయాదవ్, రవికుమార్, రాంప్రసాద్, యాకయ్య, భాస్కర్, నాగేశ్, గోవిందరాజులు, శ్రీశైలంగౌడ్, బాలరాజు, వంశీ, శ్రీధర్, సురేందర్, లోకేశ్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల డిమాండ్లను ప్రభుత్వంతో చర్చిస్తా

● టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్

మాట్లాడుతున్న టీపీసీసీ మ్యానిఫెస్టో సభ్యుడు, అధికార ప్రతినిధి రియాజ్

అంబర్‌పేట, జనవరి 28: గెస్ట్ లెక్చరర్ల డిమాండ్లను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని టీపీసీసీ మ్యానిఫెస్టో సభ్యుడు, అధికార ప్రతినిధి రియాజ్ అన్నారు.

విద్యానగర్‌లోని హిందీ మహా విద్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల గెస్ట్ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో సభ్యుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్, గెస్ట్ లెక్చరర్ల రాష్ట్ర అధ్యక్షుడు దామెర దామెర ప్రభాకర్, ప్రొ. జానయ్య, మాజీ టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్‌లు పాల్గొన్నారు. గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను గుర్తించి కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టినందుకు ప్రభుత్వానికి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు సరైన విద్యను అందించే దిశగా లెక్చరర్లు పని చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించి సంవత్సరంలోని 12 నెలల సాలరీని అందించే దిశగా ప్రభుత్వం చూడాలని గెస్ట్ లెక్చరర్స్ అధ్యక్షుడు ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

నుమాయిష్ సందడి

ఆదివారం సెలవు దినం కావడంతో నాంపల్లిలో ఏర్పాటు చేసిన అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)కు భారీ సంఖ్యలో సందర్శకులు హాజరయ్యారు. నుమాయిష్‌లోని వివిధ స్టాళ్లతో పాటు మార్కెట్‌లోకి వచ్చిన నూతన వస్తువుల గురించి తెలుసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఈ సందర్భంగా అమ్యూజ్‌మెంట్ పార్కు, తదితర స్టాళ్ల వద్ద సందర్శకుల తాకిడి భారీగా కనిపించింది.

– అబిడ్స్, జనవరి 28

తాపీమేస్త్రి ఆత్మహత్య

కాచిగూడ, జనవరి 28: తాపీమేస్త్రి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలుకు చెందిన బండారు గిరి (32)తాపీమేస్త్రి. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం అర్ధరాత్రి ఫలక్‌నుమా రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం జనవరి 28 : విద్యుత్‌లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ మెహిదీపట్నం ఓవర్‌హెడ్ ఫీడర్‌లో సోమవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, 11 కేవీ అంబాగార్డెన్ ప్రాంతాలలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు, 11 కేవీ మెహిదీపట్నం కేబుల్ ఫీడర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కేవీ మురాద్‌నగర్, జేబాబాగ్ ఫీడర్ల ప్రాంతాల్లో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీఓ ప్రకటనలో తెలిపారు.

నేడు ప్రజావాణి

సికింద్రాబాద్, జనవరి 28: సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జడ్సీ రవికిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పదిన్నరకు కార్యక్రమం ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని, సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి ప్రతి సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు డీసీ సుధాంష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.